కథానిక :

# కనువిప్పిన మాతృ హృదయం

డి. వాణి

పాపా! నేను నిన్న రాత్రి ఊరి నించి వచ్చేశాను, శెలవులకి నీ ఎక్కడికీ వెళ్ళలేదూ?, అంటూ యేడేళ్ళ రాణి, మెట్లమీద కూర్చొని బొమ్మల పుస్తకం చూస్తున్న పాపను పలుకరించింది. పాప తలెత్తి రాణి వైపు చూచి స్నేహ పూర్వకంగా నవ్వింది.

"మా అమ్మ నాకు యెన్నో గౌనులు కుట్టించింది. మా నాన్నగారు మంచి పుస్తకాలు యిచ్చారు రా చూపిస్తాను' అని పాప చేయి పట్టుకొని తన రూముకి తీసుకెళ్ళింది. అన్నీ చూపించి బిస్కట్లు, చాక్లెట్లు యిచ్చింది. ఇంతలో స్కూల్ బెల్ అయింది. ఇద్దరూ క్లాసుకి వెళ్ళారు. ఆ రోజే సెలవులైతే తిరిగి వచ్చిన పాపల ఆట పాటలతో హాస్టలంతా కలకలలాడింది.

'అమ్మా! నాన్నా!' పాప పసి హృదయం బాధగా మూల్గింది. తన నెవరూ శెలవులకి తీసుకెళ్ళరు! తన అమ్మ యెప్పుడూ రాదు! ఎగ్జిబిషన్‌కు తీసుకెళ్ళే నాన్న తనకు లేరు! పాప ఆ రోజంతా దిగులుగా ఒంటరిగా కూర్చుండి పోయింది.

రాత్రి తొమ్మిదైంది. మేట్రన్ విమల తన గదిలోకి వచ్చింది. పాప పుస్తకం చదువుతూంది.

'ఇంకా పడుకోలేదేం పాపా?' అని అడిగింది:

'ఆంటీ!' పాప కళ్ళెత్తి విమల వైపు చూచింది.

'నాకు అమ్మ లేదా ఆంటీ?' పాప పసిడి బుగ్గల మీంచి కన్నీళ్లు జారాయి.

'నీకు అమ్మ ఉందమ్మా! ఈ సారి సెలవులకి తప్పకుండా వస్తుంది. ఇంక పడుకో' అని లాలించింది. పాప ప్రశ్న ఆమె హృదయాన్ని కలచింది.

'అమ్మ! ఎప్పుడు వస్తుందో?' అంటూ పాప దిగులుగా కళ్లు మూసింది.

జయ సామాన్య కుటుంబీకుల యింట్లో పుట్టింది. ఆమె అక్కలకు, అన్నలకు డబ్బంతా పెట్టిన తల్లిదండ్రులు జయ పెద్దదయేసరికి పూర్తిగా చితికి పోయారు. అన్నలు సహాయం చేయలేదు. జయ ఫోర్తుఫారం వరకు చదువుకున్నది. చక్కగా ఉంటుంది. చదువుకొనే రోజుల్లో పాటల పోటీల్లో, నాటకాల్లో పాల్గొని బహుమతులు సంపాదించింది.

ప్రకాశరావు జయ మేనత్త కొడుకు. స్కూలు ఫైనలు ప్యాసయి ఉద్యోగంలో చేరాడు. సహృదయుడు. డబ్బుగల యింటి కోడలు కావాలని జయ కలలు కన్నా పరిస్థితుల ప్రాబల్యం వలన ప్రకాశరావును వివాహం చేసుకోక తప్పలేదు. ప్రకాశరావుకి జయ అంటే యెంతో ప్రేమ, వీలైనంత వరకు ఆమెకే లోటూ రానిచ్చేవాడు కాదు. కాని ఆమెలో గూడు కట్టుకున్న అసంతృప్తి ఆమెను బాధిస్తూ ఉండేది.

జయకు కూతురు పుట్టింది. ప్రకాశరావు పాపను ఒక్క క్షణం వదిలేవాడు కాదు. కాని దురదృష్టవశాత్తూ పాపకు యేడాది నిండకముందే అతను కారు ప్రమాదానికి గురిఅయి చనిపోయాడు. తల్లిదండ్రులు కూడ లేకపోవడం వలన ఆమెను ఆదరించే వారెవరూ లేకపోయారు. ప్రశాంతంగా ఉండే ఆమె జీవితం కష్టాల పాలైంది.

రెడ్డి ప్రకాశరావు స్నేహితుడు. ప్రకాశరావు బ్రతికి ఉన్నప్పుడు తఱచుగా వచ్చేవాడు. అప్పుడప్పుడు వచ్చి యోగక్షేమాలు కనుక్కొంటూ ఉండేవాడు.

కొద్ది రోజులకు జయ స్నేహితురాలు నీరజకు జయ పడే కష్టాలు గురించి తెలిసింది. తన వద్దకు వచ్చి ఉండమని ప్రైవేటుగా చదివించి ట్రైనింగులో చేర్పించి జీవనోపాధికి దారిచూపెడతానని వ్రాసింది. కాని రెడ్డి డబ్బుతో చూపే ఆశల ముందు జయ నీరజ సలహాకి ప్రాముఖ్యం ఇవ్వలేకపోయింది. చిన్నప్పటి నించి డబ్బులేక తీర్చుకోలేని సరదాల వైపు ఆమె హృదయం పరుగులు పెట్టింది. తత్ఫలితంగా జయ సంఘపు నిందలను సహితం లక్ష్య పెట్టక రెడ్డి వెంట మెడ్రాసు వెళ్ళిపోయింది.

రెడ్డి జయను తనకు సంబంధమున్న సినిమాకంపెనీలో ప్రవేశపెట్టాడు. కొన్నాళ్ళు చిన్నచిన్న వేషాలు వేస్తూ గడిపింది నాలుగు సంవత్సరాల్లో అదృష్టం కలిసివచ్చి ఆమె నటించిన చిత్రాలకి విపరీతంగా ఆదరణ లభించింది. కాని జయ పూర్తిగామారిపోయింది.

జయకు రెండు పెద్ద బంగళాలు. కారుఉన్నాయి. ఆమె కోసం అందరూ ఎగరబడేవారు, ఆమెకోరినది, క్షణాలమీద లభించేది. ఇప్పుడామెకు పాపనుచూచేందుకు టైమేలేదు. ఆమె మనస్సు పూర్తిగా డబ్బుసంపాదనమీద కేంద్రీకృతమై పోయింది. పాప తనకు అడ్డుగా ఉన్నట్లు తోచేది. ఆమె మాతృహృదయపు పవిత్రతని, ప్రేమని పరిస్థితులు పూర్తిగా కప్పేశాయి పాపను చూచినప్పుడు ఆ అమాయక నేత్రాల్లో ప్రకాశరావు మెదిలేవాడు, "డబ్బుకోసం యింత నైచ్యానికి ఒడిగడతావా? కళారాధన పేరుతో యిలాతయారయావా?" అని నిలదీసి ప్రశ్నించినట్లయేది. పాప కళ్ళలోకి సూటిగా చూడలేకపోయేది. భర్తతో గడిపిన జీవితం కలగా భావించి మర్చిపోవడానికి ప్రయత్నించ సాగింది. చివరకు పాపను హాస్టల్‌లో పెట్టాలనే నిశ్చయానికి వచ్చింది

పాపను ఋషీవ్యాలీకి తీసుకెళ్ళింది.

"పాప కొన్నిసంవత్సరాలిక్కడే ఉంటుంది. డబ్బు ప్రతీనెలా పంపుతాను. కాని నేనుమటుకు తరుచుగా రాలేను" అన్నది మేట్రన్ విమలతో. పెద్ద కళ్ళతో అమాయకంగా చుట్టూ పరికిస్తున్న పాపపై విమలకు వాత్సల్యం, జాలికలిగాయి.

పాప బుద్ధిగా [illegible]లికి పోతుండా చదువుకుంటూఉండేది. బొమ్మలు వేస్తూ ఉండేది. విమల ప్రోత్సహించి వాటిని మేగజైన్లకు పంపేది. చదువులోకూడ చురుకుగా ఉండేది. ప్రతిసెలవులకు పిల్లలను తీసుకొని వెళ్ళడానికి తల్లిదండ్రులు వచ్చేవారు. తన నెవరూ తీసుకెళ్ళరని, తనకోసం యెవరూ రారని పాప దిగులు పడేది.

మూడు సంవత్సరాలు గడిచి పోయాయి. జయ డబ్బు పంపిందికాని ఒక్కసారికూడ రాలేదు. పాపకు విమల మంచిగౌనులుకుట్టించినా, యెన్నోకొనిచ్చినా అసంతృప్తిగానేఉండేది. ఒకసారి విమలరమ్మనివ్రాస్తే వీలులేదని వ్రాసింది. ఏ తల్లి దండ్రుల్ని చూచినా విమలకు. పాపపై సహజవాత్సల్యాన్ని ప్రదర్శించుకోని జయ. 'అమ్మ' రాకకోసం ఆత్రుతగా యెదురు. చూచే పాప కళ్ళలో మెదిలేవారు ఎంతో బాధపడేది.

♦ ♦ ♦

ఆంటీ! నాకసలు అమ్మ ఉందా? మరి యెప్పుడూ రాదేం? పాప పదేపదే విమలను ప్రశ్నించసాగింది. హృదయవిదారకమైన ఆ ప్రశ్న విమలనెంతో బాధించేది. జయకు వ్రాసిన ఉత్తరాలకు జవాబే వచ్చేది కాదు.

'మీ అమ్మకు రావడానికి తీరుబాటులేదు. పాపా! నీవు బాగా చదువుకుంటూ పరీక్షలు పాసైతే అప్పుడు వచ్చి నిన్ను తీసుకెళ్తుంది. ఏడుస్తూ ఉంటే రాదు' అంటూ లాలించింది.

పాప యిక విమలను ప్రశ్నించలేదు. తను బాగా చదువుకొని పాసైతే వస్తుందని ఆ పసి హృదయంలో ఆశ మొలకెత్తింది.

నాలుగేళ్ళు గడిచాయి. పాపకి పదకొండో యేడు వచ్చింది. అమ్మకోసం ఆత్రుత యెక్కువైంది.

ఆ క్రిస్టమస్ సెలవులకు పిల్లలంతా వెళ్ళిపోయారు. పాప, విమల యెప్పటిలాగే ఉండిపోయారు. ఆ ఒంటరితనమూ, మార్పులేని వాతావరణమూ, అమ్మను చూడాలనే కోరిక పాప హృదయాన్ని పీడించసాగాయి. దిగులుతో యేడుస్తూపడుకొనేది. క్రమంగా మంచం పట్టింది.

'అమ్మ యెప్పుడొస్తుంది ఆంటీ?' అంటూ రాత్రింబవళ్ళు కలవరించసాగింది. పాప అనారోగ్యం చూచి విమల బెదిరిపోయింది. డాక్టర్‌ని పెట్టి శ్రద్ధగా మందలిప్పించ సాగింది.

పాపకు కొద్దిగా నయమైంది. ఉదయం పాప పాలు త్రాగుతూంటే విమల మంచంమీద కూర్చుంది

'అమ్మను రమ్మనివ్రాయి ఆంటీ!' అన్నది పాప చటుక్కున విమల కొక ఆలోచన తట్టింది.

'పాప! నీవే మీ అమ్మను రమ్మనివ్రాయి' అంటూ కాగితం, కలం తెచ్చి యిచ్చింది. పాప ఉత్సాహంగా విమల ముఖం చూసి వ్రాసింది.

పాప ఉత్తరం, తన ఉత్తరం కలిపి పోస్టుచేసిన విమల రిలీఫ్ దొరికినట్లు ఫీలయింది.

జయ యీ యేడు సంవత్సరాల్లో చాలడబ్బు సంపాదించింది. నటిగా మంచిపేరు వచ్చింది. ఆమె వ్యక్తిగత జీవితం మలిన భూయిష్టమైనా సొసైటీలో గొప్పవ్యక్తిగ పరిగణింప బడేది ఎన్నడైనా సాయంత్రం చల్లగాలికి డాబామీద తిరుగుతున్నప్పుడూ, ఉదయం వేళ గార్డెన్‌లో కూర్చొని చదివేటప్పుడూ భర్తా, పాపా గుర్తొచ్చేవారు. మనస్సు వికలమై పోయేది, ఆలోచనలు మరలించు కొందుకు ప్రయత్నించేది.

ఆనాడు శనివారం. మరునాడు షూటింగు కోసం సిమ్లా వెళ్తున్నారు. జయ ఆ చిత్రంలో నాయిక. ఉదయం కాఫీ తీసుకొని గార్డెన్‌లో కూర్చుంది. నౌకరు మేగజైన్లు, పేపరు తెచ్చి టేబిల్ మీద పెట్టాడు. యథాలాపంగా పేపరు తిరగేస్తూంది. చిత్రలేఖనంలో మొదటి బహుమతి నందుకున్న పాపఫొటో స్కూలు వివరాలు పడ్డాయి. క్షణకాలం జయ స్తంభించి పోయింది. పాప అమాయకపు చూపులామెను కరగించి వేశాయి. దీక్షగా ఫొటో వైపు చూస్తున్న జయ "ఉత్తరం అమ్మగారూ" అన్న పిలుపుతో త్రుళ్ళి పడింది. ఆత్రుతగా విప్పింది.

"జయా !

ఈనాటి వరకు నీవు నేను వ్రాసిన ఉత్తరాలకు జవాబీయడం కాని, పాపను చూడటానికి రావడం గాని చేయలేదు. పాపపసి హృదయం నీకోసం యెంత ఆరాట పడుతూందో నేను మాటల్లో వ్యక్తీకరించ లేను. నీమీది బెంగతో చిక్కి శల్యమై పోయింది. ఈసారైనా వస్తావని ఆశించే

నీ విమల.

"అమ్మా !

నాకు నిన్ను చూడాలని ఉంది. ఎప్పుడు వస్తావమ్మా ! పరీక్షలు బాగా వ్రాసాను, ఎన్నో ప్రైజులు కూడ వచ్చాయి. త్వరగా వచ్చి సెలవులకు తీసుకెళ్ళవూ? రావూ?—పాప.

నీళ్ళునిండిన జయ కళ్ళకు అక్షరాలు మసగగా కన్పించాయి. చిట్టి పాప వేడికోలుతో ఆమె ప్రేమ సెల్లుబికింది. ఇన్నాళ్ళు గడిపిన మలిన భూయిష్టమైన జీవితాన్ని తట్టుకొని క్రుంగిపోయింది. స్నేహితురాలు ఆప్యాయంగా సహాయం చేయబోయినా తిరస్కరించినందుకు విచారించింది. ప్రకాశరావు నిర్మల ప్రేమానురాగాలు, బీదరికంలో కూడ లోటులేని మధురజీవితం కళ్ళముందు మెరిశాయి. చనిపోయిన భర్తకు, పాపకు డబ్బుకోసం చేసిన ద్రోహానికంతో బాధపడింది. ఇక యీ జీవితానికి స్వస్తి చెప్పాలని, పాపను పెంచి పెద్ద చేయడమే తన జీవిత పరమావధి అని నిశ్చయించుకుంది. పాప కోసం ఆమె హృదయం ఆరాట పడసాగింది.

వెంటనే ప్రొడ్యూసర్‌కి ఫోను చేసింది, తను బయలుదేరి వెళ్ళి పోతున్నట్లు, తను చిత్రాలనుంచి విరమించు కుంటున్నట్లు చెప్పింది. అందరూ చాలా ఆందోళన చెందారు. వద్దని కోరారు. కాని ఆమె యెవరి సలహాను లక్ష్యపెట్టలేదు. ఆరాత్రే తన యీ యేడేళ్ళ జీవితానికి స్వస్తిచెప్పి తన జీవిత సర్వస్వం అయిన చిన్నారి పాపదగ్గరకు వెళ్ళిపోయింది.

రాత్రి యెనిమిది గంటలైంది. స్టేషనులో పాప, విమల ట్రెయిన్ రాక కోసం యెదురు చూస్తున్నారు. అంతలోనే వచ్చింది ఫస్టుక్లాసు కంపార్టుమెంటు గుమ్మంలో నించున్న జయ విమల కెదురుగా కనబడింది.

"అదిగో మీ అమ్మ ..." విమల అంటూ ఉండగానే "అమ్మా" అంటూ పరుగెత్తింది.

"పాపా !" రుద్ధకంఠంతో అంటూ పాపను దగ్గరకు తీసుకొని వాత్సల్యంతో నిమిరింది జయ.

దూరంగా నిలబడి చూస్తున్న విమల తృప్తిగా నిట్టూర్చింది.